ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

మంగళవారం 25 నవంబరు 2025

మళ్లీ తుపాను ముప్పు ?

- బంగాళాఖాతంలో రెండు వాయు'గండాలు'
- 29నుంచి కుంభవృష్టి

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈశాన్యరుతుపవనాలు తీవ్ర రూపం దాల్చటంతో బంగాళాఖాతంలో వరుసగా రెండు అల్పపీడనాలు కేంద్రీకృతమై వాయుగుండాలుగా మారే అవకాశం ఉందని, దీంతో ఈ నెల 29 నుండి రాష్ట్రంలో కుండపోతగా వర్షాలు కురిసే అవకాశముందని స్థానిక వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతి యేటా ఈశాన్యరుతుపవనాల ప్రభావంతో అక్టోబరు, నవంబర్, డిసెంబర్ నెలల్లో చెన్నై పరిసర జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తుంటాయి. ఆ ప్రకారమే ఈ యేడాది అక్టోబర్‌లో భారీగా వర్షాలు కురిశాయి. కానీ నవంబర్‌లో ఆశినంతగా వర్షాలు కురవలేదు. గత పదిహేను రోజులుగా రాష్ట్రంలో దక్షిణాది జిల్లాల్లో ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసి వరి, అరటి పంటలను ముంచెత్తాయి. తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి జిల్లాలో ప్రస్తుతం కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో వచ్చే 48 గంటలలోగా అల్పవాయుపీడనం తుఫానుగా మారనుందని చెన్నై వాతావరణ కేంద్రం సంచాలకులు డాక్టర్ అముద తెలిపారు. మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మలాక్కా జలసంధి దాని సీమపంలోని దక్షిణ అండమాన్ తీరంలో కేంద్రీకృతమైన అల్ప పీడనం సోమవారం వేకువజాము 5.30 గంటలకు ఆ ప్రాంతంలోనే స్థిరంగా ఉందని, వచ్చే 24 గంటల్లోగా ఆ అల్పపీడనం పడమటి దిశగా ఆగ్నేయం వైపు కదలుతూ అండమాన్ వద్ద వాయుగుండంగా మారనుందని వివరించారు. రానున్న 24 గంటల్లోగా ఆ వాయుగుండం తుఫాన్‌గా మారనుందని వెల్లడించారు. ఇదే విధంగా కేమరూన్ సమీపం ఆగ్నేయ బంగాళాఖాతంలో శ్రీలంకకు సమీపంలో ఏర్పడిన అల్ప పీడనం కూడా సోమవారం వేకువజాము అక్కడే స్థిరంగా ఉందని, ఆ అల్ప పీడనం తుఫానుగా మారే అవకాశాలున్నాయని తెలిపారు.

దక్షిణాది జిల్లాలకు భారీ వర్షసూచన...

బంగాళాఖాతంలో వరుసగా రెండు వాయుగుండాలు తరుముకు వస్తుండటంతో అరియలూరు, పెరంబలూరు, తిరుచ్చి, కరూరు, నామక్కల్, ఈరోడ్, తిరుప్పూరు, కోవై, నీలగిరి, దిండుగల్, తేని, మదురై, విరుదునగర్, శివగంగ జిల్లాలో భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాల్లో మంగళవారం నుండి నెలాఖరుదాకా చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు. ఈ నెల 29న చెన్నై నగరానికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో

కుండపోత

- తామ్రభరణి నదికి వరదలు
- స్తంభించిన జనజీవనం



తిరునల్వేలిలో పొంగి ప్రవహిస్తున్న తామ్రభరణి నది

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో రెండురోజులుగా కురిసిన భారీ వర్షాలకు తామ్రభరణిలోకి వరద పోటెత్తింది. రహదారులు, జనావాస ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చటంతో శ్రీలంక, కన్నియాకుమారి నడుమ సముద్రం మీదుగా పెనుగాలులు వీస్తుండంటంతో ఈ రెండు జిల్లాల్లో రెండు రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం వరకు తిరునల్వేలి నగరంలో కురిసిన వర్షాల కారణంగా వన్నార్‌పేట, టౌన్, పాళయం కోట ప్రధాన రహదారులపై నీరు వరదలా ప్రవహిస్తోంది. తామ్రభరణి వాగు సమీపంలో ఉన్న మురుగన్ ఆలయం పూర్తిగా నీటిలో మునిగింది. ఇక చేరన్‌మహాదేవి పరిసర ప్రాంతాల్లో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో కోతకు సిద్ధంగా ఉన్న సుమారు 2 లక్షలకు పైగా అరటి చెట్లు నేలకొరిగాయి.

రిజర్వాయర్లలో పెరిగిన నీటిమట్టం...

పశ్చిమ కనుమల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా రిజర్వాయర్లలో నీటి మట్టం పెరిగింది. 143 అడుగుల సామర్థ్యం ఉన్న పాపనాశం డ్యాం నీటిమట్టం ఒకే రోజు ఏడడుగులు పెరిగి 130 అడుగులకు చేరింది. ఇదే విధంగా సేర్వలార్ డ్యాం నీటిమట్టం 11 అడుగులు పెరిగి 141.27 అడుగులకు చేరింది. తిరుచెందూరు, కులశేఖరపట్టినం, కాయల్పట్టినం తదితర తీర ప్రాంతాల్లో 10 సెం.మీల కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. మరదూరు, శ్రీవైకుంఠం డ్యాంల నుంచి కలియాఫూర్, పున్న కాయల్ వరకు వరదలు సంభవించడంతో ఆ ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వెంబార్ నుండి పెరియతాళి వరకు ఉన్న గ్రామాల్లో మత్స్యకారులు సముద్రంలోకి చేపలవేటకు వెళ్ళకూడదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

తెన్‌కాశి జిల్లాలో...

తెన్‌కాశి జిల్లాలో గత ఐదు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు అడవినయినార్, కుండారు చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇదే విధంగా రెండు రోజుల వర్షానికి కడనా నది, రామనది, కురుప్పాంది ఆనకట్టలోకి నీరు చేరుతోంది. మూడు జిల్లాల్లో భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో చెన్నై నుంచి రాష్ట్ర విపత్తుల నివారణ బృందానికి చెందిన 75 మంది సహాయ చర్యలు చేపట్టేందుకు తరలివచ్చారు. ఇక భారీ వర్షాల కారణంగా తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాల్లో సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఇదేవిధంగా అరియలూరు, రామనాథపురం, తిరువారూరు, తూత్తుకుడి, కళ్ళకురిచ్చి, పుదుకోట, తిరుచ్చి, తంజావూరు, మైలాడుదురై, విరుదునగర్, శివగంగ, నాగపట్టినం, కరూరు జిల్లాల్లో పాఠశాలలకు మాత్రమే సెలవు ప్రకటించారు.



జలదిగ్బంధంలో ఆలయం





తామ్రభరణి తీరంలో పోలీసుల గస్తీ



పొంగిపొర్లుతున్న గుండారు డ్యాం

కావేరి బేసిన్‌ను ఎడారిగా మార్చే యత్నం

- సీఎం స్టాలిన్‌పై ఈపీఎస్ విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న ఈపీఎస్

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కావేరి బేసిన్‌ను ఎడారిగా మార్చేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రయత్నించారని, ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకుండా మోసం చేశారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) విమర్శించారు. సేలంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉద్యోగుల కొరత పరిష్కరించకపోవడంతో రైతుల పడించిన ధాన్యాన్ని ఈ సీజన్‌లో సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో అన్నదాతలు ఆర్థికపరంగా నష్టపోయారన్నారు. కావేరి పరీవాహక జిల్లాల్లో దాదాపు 6లక్షల ఎకరాలకు పైగా కురువై సాగు జరిగిందని, అయితే దాన్యం కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం సరికాదన్నారు. కేంద్రప్రభుత్వం అమలుపరిచిన 3 వ్యవసాయ చట్టాలపై స్టాలిన్‌కు అవగాహన లేదని, ఒకవేళ వాటి గురించి తెలిసుంటే ప్రజలకు ఆ వివరాలను తెలియజేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతల గోడు వినిపించుకోని డీఎంకే ప్రభుత్వం కావేరి బేసిన్ జిల్లాను ఏడాదిగా మార్చేందుకు ప్రయత్నించిందని, రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నించింది తామేనన్నారు.

రైతులకు ఈపీఎస్ ద్రోహం

సీఎం స్టాలిన్ ఆగ్రహం

అడయార్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి పచ్చి మోసం చేశారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆరోపించారు. ఈ విషయంపై ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డెల్టా రైతులు కన్నీరు తుడిచేందుకు అండగా నిలబడాల్సిన ఎడప్పాడి... మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఈ యేడాది విస్తారంగా కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో అందులో తేమ శాతం పెరిగిందన్నారు. దిగుబడి వచ్చిన వెంటనే ధాన్యం సేకరణ ప్రక్రియకు కేంద్రం అనుమతి ఇచ్చిఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. పైగా ఇపుడు రాజకీయం చేస్తూ, భుజంపై పచ్చ కండువా వేసుకుని ఎడప్పాడి పచ్చి ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం సేకరణ సమయంలో తేమ శాతాన్ని 22 శాతాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరగా, ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు, పలు రాజకీయ పార్టీల నేతలు వివిధ రకాలుగా ఆందోళనలు చేస్తున్నారన్నారు. పోరాటం చేసేవారికి అండగా నిలబడేందుకు ఎవరి అనుమతి కోసం ఎడప్పాడి ఎదురు చూస్తున్నారు? పొత్తులనేవి రాష్ట్రానికి మేలు జరగాలని, రాష్ట్ర హక్కులను హరించేలా ఎడప్పాడి పొత్తులు పెట్టుకోవాలని భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు పోటీపడి మద్దతు తెలిపిన ఎడప్పాడి... ఒక్కసారైనా తలపైకెత్తి మన రైతులు కోరికలను కేంద్రం దృష్టికి తీసుకెళ్ళినట్టు చెప్పగలరా? అని నిలదీశారు. రక్తాన్ని ధారపోసి శ్రమించే రైతులు కష్టం వృధా కారాదని సీఎం స్టాలిన్ అన్నారు.

3 సెగ్మెంట్ల నిర్వాహకులతో సీఎం స్టాలిన్ సమీక్ష



స్టాలిన్‌తో రామనాథపురం జిల్లా నేత

వచ్చే యేడాది ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులను సమాయాత్తం చేసేందుకు, నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నాయకులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం రామనాథపురం, మానామదురై, కారైక్కుడి అసెంబ్లీ స్థానాలకు చెందిన పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ఆ మూడు నియోజక వర్గాలకు చెందిన నిర్వాహకులు పాల్గొన్నారు.

విచారణ జరపకుండా

ఒక్క ఓటూ తొలగించలేరు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్



ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి విచారణ జరపకుండా ఓటరు జాబితా నుండి ఓటర్‌ను తొలగించడం సాధ్యంకాదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 6.16కోట్ల ఓటర్లకు దరఖాస్తు ఫారాలు పంపిణీ చేసినట్లు వివరించారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్‌కు సంబంధించి సచివాలయంలో సోమవారం ఉదయం ఈసీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అర్చనా పట్నాయక్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు నేతలు సర్ ప్రక్రియపై అడిగిన ప్రశ్నలకు ఆమె వివరణ ఇచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 234 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల ద్వారా సుమారు 50శాతం ఫారాలను స్వీకరించినట్లు తెలిపారు. ఎలాంటి విచారణ లేకుండా ఓటరు జాబితా నుండి ఓటర్లను తొలగించడం సాధ్యం కాదన్నారు. 68,647 మంది బీఎల్వోలు సహా 2.45 లక్షల మంది సర్ విధుల్లో పాల్గొంటున్నారని, దేశంలో తమిళనాడులో మాత్రమే సర్‌పై ఎక్కువ మంది బీఎల్వోలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. చెన్నైలో 96 శాతానికి పైగా సర్ దరఖాస్తు ఫారాల వినియోగం జరిగిందని, పూర్తిచేసిన ఫారాల స్వీకరణ గడువు పొడిగించే అవకాశం లేదన్నారు.

అరుణాచలానికి కార్తిక శోభ

- తిరువణ్ణామలైలో దీపోత్సవాలు ప్రారంభం
- 15వేల మందితో భారీ బందోబస్తు



ధ్వజ పతాకాన్ని ఎగురవేస్తున్న శివాచార్యులు

వేలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగ్నిక్షేత్రంగా పేరుగాంచిన తిరువణ్ణామలైలో పది రోజులపాటు నిర్వహించనున్న కార్తిక దీపోత్సవాలు సోమవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో కార్తిక దీపోత్సవాలకు ప్రసిద్ధి చెందిన తిరువణ్ణామలై క్షేత్రం మామిడి, అరటితోరణాల అలంకరణ, విద్యుద్దీపాల వెలుగుల్లో ప్రకాశిస్తోంది. ఉన్నాములై అమ్మవారి సమేత అన్నామలైయార్ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, అన్నామలైయార్, ఉన్నాములై అమ్మవారు, చండికేశ్వర్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నామలైయార్ సన్నిధి ముందు పంచమూర్తులను కొలుదీర్చిన శివాచార్యులు మేళతాళాలు, వేద మంత్రోచ్చారణ మధ్య ఉదయం 6.30 గంటలకు బంగారు ధ్వజస్తంభంలో కార్తిక దీపోత్సవం కోసం ప్రత్యేకంగా రూపొందించిన పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ వైభవంలో డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, జిల్లా కలెక్టర్ దర్పగరాజ్, ఎస్పీ డాక్టర్ సుధాకర్, డీఆర్వో రామ్ ప్రదీపన్, ఆలయ ధర్మకర్త మీనాక్షి సుందరం సహా సుమారు 10వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. సోమవారం ప్రారంభమైన కార్తిక దీపోత్సవాలు 10 రోజుల వరకు కొనసాగుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో పంచమూర్తులను ఆలయ మాడవీధుల్లో ఊరేగించనున్నారు. ఈ నెల 29వ తేదీ రాత్రి వెండి రథోత్సవం, 30వ తేదీ మహారథోత్సవాలను నిర్వహించనున్నారు. కార్తిక దీపోత్సవాల్లో ప్రధానాంశంగా మహాదీప దర్శన వేడుకలు డిసెంబరు 3న జరుగుతాయి. ఆ రోజు తెల్లవారు జామున 4గంటలకు అన్నామలై ఆలయంలో భరణిదీపం వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దాదాపు 40 లక్షల మందికి పైగా భక్తులు తరలి వచ్చే అవకాశముంది.

భారీ భద్రతా ఏర్పాట్లు..

కార్తిక దీప దర్శన భద్రతా విధుల్లో సుమారు 15వేల మందికి పైగా పోలీసులు పాల్గొంటారని తిరువణ్ణామలై జిల్లా ఎస్పీ డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. ఈ వేడుకలకు వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ దర్పగరాజ్ తెలిపారు. రద్దీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బీజేపీకి 'సి' టీం టీవీకే

- మీ తాటాకు చప్పుళ్లకు మేం భయపడం
- మంత్రి రఘుపతి

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఎంకేని చిత్తుగా ఓడిస్తానని, ఆ పార్టీని అడ్రస్ లేకుండా చేస్తానని టీవీకే నేత విజయ్ చేస్తున్న ప్రగల్భాలను గమనించి అందరూ నవ్వుకుంటున్నారని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి విమర్శించారు. పుదుకోటలో సోమవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీవీకే తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని, ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని 75 యేళ్లుగా సుస్థిరమైన ప్రాంతీయ పార్టీగా ఉన్న డీఎంకేని పత్తా లేకుండా చేస్తామని బెదిరించిన రాజకీయ దిగ్గజాలంతా పత్తాలేకుండా పోయారనే విషయం విజయ్‌కి తెలియడం లేదన్నారు. డీఎంకేతో తలపడితే టీవీకే చిత్తుగా ఓడిపోతుందన్నారు. ప్రచార సభలలో చిన్న తొక్కిసలాట జరిగితే విజయ్‌లా పారిపోయే నేతలెవరూ డీఎంకేలో లేరన్నారు. అటు అన్నాడీఎంకేని, ఇటు బీజేపీని విమర్శించని టీవీకే బీజేపీకి సీ-టీమ్‌లాగే వ్యవహరిస్తోందన్నారు.

బతుకులు తెల్లారిపోయాయ్ !

- తెన్‌కాశి సమీపంలో రెండు బస్సుల ఢీ
- ఆరుగురు మహిళలు సహా ఎనిమిది మంది దుర్మరణం



ప్రమాదంలో ధ్వంసమైన బస్సులు - సహాయక చర్యల్లో స్థానికులు, పోలీసులు

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా దురైసామిపురం వద్ద సోమవారం ఉదయం రెండు ప్రైవేటు బస్సులు ఢీకొన్న ఘటనలో ఆరుగురు మహిళలు సహా ఎనిమిది మంది దుర్మరణం చెందగా, 50 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు ప్రకటించారు.





సహాయక చర్యలను పరిశీలిస్తున్న మంత్రి కె.కె.ఎస్.ఆర్.రామచంద్రన్

తెన్‌కాశి నుండి రాజపాళయం వెళ్తున్న కేఎస్ఆర్ ప్రైవేటు బస్సు, కోవిల్‌పట్టి నుండి తెన్‌కాశికి వస్తున్న ఎంఆర్ గోపాలన్ ప్రైవేటు బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ రెండు బస్సులు పరిమితికి మించిన వేగంతో ఢీకొనడంతో వాటి ముందుభాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని బస్సుల శిథిలాలల నుండి క్షతగాత్రులను బయటకు తీసి చికిత్సకు తరలించారు. తెన్‌కాశి జిల్లా కలెక్టర్ కమల్ కిషోర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి సహాయ చర్యలను ముమ్మరం చేశారు.

సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి...

ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ తన ఎక్స్ పేజీలో ఓ సందేశం వెలువరించారు. తెన్‌కాశి జిల్లా కడయనల్లూరు సమీపంలో బస్సులు ఢీకొన్న ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందిన సంఘటనపై ఆయన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ.3లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నవారికి తలా రూ.లక్ష చొప్పున, స్వల్పంగా గాయపడినవారికి తలా రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ ప్రమాద స్థలంలో సహాయక చర్యలను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

సమాచార దర్శిని

జూనియర్ వరల్డ్ కప్ హాకీ పోటీలకు ఉచిత టిక్కెట్లు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మదురై, చెన్నైలో ఈ నెల 28 నుంచి డిసెంబరు 10వ తేది వరకు 14వ జూనియర్ వరల్డ్ కప్ హాకీ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో ఇండియా, ఆస్ట్రేలియా, జర్మనీ, నెదర్లాండ్, బెల్జియం, అర్జెంటీనా సహా 24 జట్లు పాల్గొననున్నాయి. ఆరు గ్రూపులుగా విభజించి లీగ్ పోటీలు నిర్వహించనున్నారు. 'బి' గ్రూపులో ఇండియాతో పాటు చిలీ, ఒమన్, స్విట్జర్లాండ్ తదితర జట్లున్నాయి. ఇండియా ఈ నెల 28వ తేది జరిగే ప్రారంభ పోటీలో చిలీతో తలపడనుంది. రాష్ట్రంలో తొలిసారిగా జరుగనున్న ఈ పోటీలను వీక్షించేందుకు ఉచిత టిక్కెట్లు అందజేయనున్నట్లు భారత హాకీ సమాఖ్య ప్రకటించింది. www.ticket-genie.in అనే వెబ్‌సైట్, హాకీ ఇండియా అధికారపూర్వక వెబ్‌సైట్‌లో నమోదుచేసుకుని డిజిటల్ టికెట్లు పొంది పోటీలు ఉచితంగా వీక్షించవచ్చు. ఒక వ్యక్తి నాలుగు టిక్కెట్లు మాత్రమే అందజేయనున్నారు. హాకీ ఇండియా అధ్యక్షులు దిలీప్ తిర్కే తెలిపారు.

21 నుంచి వండలూరు జూలో శీతాకాల శిబిరం

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్‌లో 172 రకాలకు చెందిన 2,300 జంతువులను ప్రేక్షకుల సందర్శనార్థం ఉంచారు. ఈ జూను ప్రతి ఏడాది సుమారు 20 లక్షల మంది సందర్శిస్తున్నారు. జంతువుల గురించి విద్యార్థినీ, విద్యార్థులు తెలుసుకునేలా వేసవి, శీతాకాలం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది శీతాకాలం ప్రత్యేక శిబిరాలు డిసెంబరు 21, 22, 24, 25, 26, 27, 28, 29 అని నాలుగు విడతలుగా రెండు రోజులు జరుగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరాలు నిర్వహించనున్నారు. 5వ తరగతి, అంతకు మించిన తరగతులు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు https://aazp.in/winter-camp2025/ అనే వెబ్‌సైట్‌లో రూ.900 రుసుముతో పేర్లు నమోదు చేసుకోవాలి. శిబిరంలో పాల్గొనే విద్యార్థులను, జూ రాయబారులుగా నియమిస్తూ సర్టిఫికెట్ అందజేస్తారు. అలాగే, జూను ఏడాదిలో 10 సార్లు ఉచితంగా వీక్షించే అవకాశం కల్పించనున్నట్లు జూ అధికారులు తెలిపారు.

'చెన్నై వన్' యాప్‌లో రైల్వే సీజన్ టిక్కెట్లు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (గుమ్టా) పరిచయం చేసిన 'చెన్నై వన్' యాప్‌లో సబర్బన్ రైళ్ల సీజన్ టిక్కెట్లు, రిటర్న్ టిక్కెట్లు పొందేందుకు దక్షిణ రైల్వే అంగీకారం తెలిపింది. నగరంలో మెట్రో, సబర్బన్ రైళ్లు, ఎంటీసీ బస్సుల్లో ప్రయాణించే వారు సులభంగా టిక్కెట్లు పొందేలా 'చెన్నై వన్' యాప్‌ను పరిచయం చేశారు. సెప్టెంబరు 22న ప్రారంభించిన ఈ యాప్‌ను ప్రస్తుతం 5 లక్షల మందికి పైగా వినియోగిస్తున్నారు. ఈ యాప్ ద్వారా మంత్లీ బస్ పాస్‌లు అందించేందుకు ఎంటీసీ చర్యలు చేపట్టింది. అలాగే, సబర్బన్ రైళ్ల ప్రయాణికులు, నెలవారీ సీజన్ టిక్కెట్లు, రిటర్న్ టిక్కెట్లు, 'ఏసీ' సబర్బన్ రైలు టిక్కెట్లు, ప్లాట్ ఫారం టిక్కెట్లు అందించేందుకు అంగీకారం తెలపాలని 'గుమ్టా' రాసిన లేఖను పరిశీలించిన దక్షిణ రైల్వే అందుకు ఆమోదం తెలిపిందని అధికారులు తెలిపారు.

28న రైతులకు అవగాహన సదస్సు

తిరువళ్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి రైతు సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 28వ తేదీ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతాప్ ప్రకటించారు. ఇందులో భాగంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. ఈ అవగాహన సదస్సులో రైతులు పాల్గొని వ్యవసాయ పనిముట్లను రాయితీపై పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అలాగే బ్యాంకుల ద్వారా ప్రభుత్వం వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పనులపై అందిస్తున్న రుణాలపై వివరించేందుకు సహకార బ్యాంకుల అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఇందులో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ సహా పలు శాఖలకు చెందిన అధికారులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రైతులకు అందుబాటులో ఉంటారన్నారు.

'మంజప్పై' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం అమలులో ఉన్న నేపథ్యంలో, ప్రత్యామ్నాయ వాడకాన్ని ప్రోత్సహించి, పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న మూడు పాఠశాలలు, మూడు కళాశాలలు, వాణిజ్య సంస్థలకు 'మంజపై' పురస్కారం అందజేయనున్నారు. మొదటి బహుమతి రూ.10 లక్షలు, రెండో బహుమతి కింద రూ.5 లక్షలు, మూడో బహుమతిగా రూ.3 లక్షలు అందించనున్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు చెన్నై జిల్లా, కాలుష్య నియంత్రణ బోర్డు వెబ్‌సైట్‌ల నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిచేసి 2026 జనవరి 15వ తేదిలోపు సమర్పించాలని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

మాజీ ఎమ్మెల్యే హత్యకేసులో ముగ్గురికి యావజ్జీవం

● తీర్పునిచ్చిన హైకోర్టు

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి అన్నాడీఎంకే నేత, మాజీ ఎమ్మెల్యే సుదర్శనం హత్యకేసులో నిందితులు ముగ్గురికి మద్రాస్ హైకోర్టు యావజ్జీవ శిక్ష విధిస్తూ సోమవారం తీర్పునిచ్చింది. 2001-2006వ సంవత్సరం వరకు అన్నాడీఎంకే ఎమ్మెల్యేగా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా సుదర్శనం వ్యవహరించారు. పెరియపాళయం సమీపంలోవున్న తానాకుళంలో ఆయన తన కుటుంబంతో నివసించారు. 2005 జనవరి 9వ తేదీ అర్ధరాత్రి ఎమ్మెల్యే సుదర్శనం ఇంట్లో చొరబడిన భవారియా దోపిడీ ముఠా ఆయనను తుపాకీతో కాల్చి చంపి, ఆయన భార్య, కుమారులపై దాడి చేసి, 62 సవర్ల నగలు దోచుకుని పరారయ్యారు. కలకలంరేపిన ఈ హత్యతో సంబంధమున్న ముఠాను తుపాకీతో కాల్చి నిర్బంధించాలని అప్పటి ముఖ్యమంత్రి జయలలిత పోలీసులకు ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు సుదర్శనం హత్యకు సంబంధించి భవారియా ముఠాకు చెందిన తొమ్మిది మందిని అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు. వీరిలో ముగ్గురు మహిళలు బెయిల్‌పై విడుదలై అజ్ఞాతంలోకి జారుకోగా, మరో ఇద్దరు జైలులోనే మృతిచెందారు. మిగతా నలుగురిలో జగదీష్, రాకేష్, అశోక్ అనే ముగ్గురిని మద్రాస్ హైకోర్టులో జరిగిన తుది విచారణకు భారీ బందోబస్తుల మధ్య పోలీసులు గత శుక్రవారం హాజరుపరిచారు. వారిని దోషులుగా ప్రకటించిన న్యాయమూర్తి అబ్రహాం లింకన్ శిక్ష వివరాలను సోమవారం వెల్లడించనున్నట్లు తీర్పులో తెలిపారు. ఆ మేరకు దోషులు ముగ్గురిని సోమవారం ఉదయం మద్రాస్ హైకోర్టులో విచారణకు హాజరుపరచగా వారికి 20యేళ్లకు పైగా జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.



మాజీ ఎమ్మెల్యే సుదర్శనం (ఫైల్‌ఫొటో)



నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్న పోలీసులు

చదురగిరి ఆలయానికి భక్తుల నిషేధం

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చదురగిరి ఆలయానికి భక్తులు వెళ్లేందుకు జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపంలోని పశ్చిమ కనుమల్లో చదురగిరి సుందర మహాలింగం ఆలయం ఉంది. గతంలో పౌర్ణమి, అమావాస్య, ప్రదోష పూజలకు మాత్రమే భక్తులను అనుతిస్తుండగా, ప్రస్తుతం ప్రతిరోజు అనుమతిస్తున్నారు. అటవీ శాఖకు సొంతమైన ఈ ప్రాంతంలో భారీవర్షాలు కురుస్తున్న సమయంలో ఆలయానికి భక్తులు వెళ్లేందుకు నిషేధం విధిస్తుంటారు. ఈ క్రమంలో, ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఈ ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో, కొండ మార్గంలో నీటి ప్రవాహం అధికమైంది. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో, ఆలయానికి భక్తులు వెళ్లేందుకు అటవీ శాఖ నిషేధం విధించింది. ఈ క్రమంలో, సుందర మహాలింగం, పలువురు స్వాములకు అభిషేకం, అలంకార, ప్రత్యేక పూజలు యధావిధిగా నిర్వహించారు.



ఆలయానికి వెళ్లే గేటుకు తాళాలు వేసిన దృశ్యం

మట్టి తరలిస్తున్న లారీల స్వాధీనం

● ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్



పోలీసులు సీజ్ చేసిన లారీలు

తిరువళ్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరులో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కడంబత్తూరు యూనియన్, మేల్ నల్లత్తూర్ పంచాయతీలో చెరువు ప్రాంగణం నుండి అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతాప్‌కు ఫిర్యాదులందాయి. దీంతో ఖనిజ వనరుల శాఖ అసిస్టెంట్ డైరక్టర్ లక్ష్మీప్రియ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసన్‌లను వెంటనే మట్టి తరలింపులను అడ్డుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా మేల్‌నల్లత్తూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో 3 మట్టిలోడు లారీలను ఆపి తనిఖీ చేయగా వారు ఎలాంటి అనుమతిపత్రాలు లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఆ లారీలను నడుపుతున్న ముగ్గురు డ్రైవర్లలో ఒకరు పరారైనట్లు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరు లారీ డ్రైవర్లు అరన్వాయల్‌కుప్పానికి చెందిన ఆనందన్, శివగంగై జిల్లా పప్పంకుళం ప్రాంతానికి చెందిన రవిచంద్రన్ గా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనలో మూడు లారీలను సీజ్ చేసి, ఇద్దరు డ్రైవర్లను రిమాండ్‌కు తరలించి, పరారీలో ఉన్న డ్రైవర్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

లారీ ఢీకొని బిహార్‌వాసి మృతి

తిరువళ్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన తచ్చూర్ జాతీయ రహదారిలో జరిగింది. వివరాలిలా.. బిహార్ రాష్ట్రం, సమస్తిపూర్ జిల్లా, సోనూపూర్ గ్రామానికి చెందిన తిరువళ్లూరు జిల్లా తచ్చూరులో కమలేష్ యాదవ్ (37) తన అన్న రాజ్‌కుమార్ యాదవ్‌తో కలిసి భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం కమలేష్ పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా, గుమ్మిడిపూండి నుంచి వస్తున్న లారీ అతడిని ఢీకొంది. విషయం తెలుసుకున్న అతడి సోదరుడు రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని కమలేష్‌ను స్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కవరపేట పోలీసులు కమలేష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన అనంతరం దీనిపై కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

గార్డును ఢీకొన్న బైక్...

సైకిల్‌పై వెళుతున్న ఓ సెక్యూరిటీ గార్డును ఢీకొన్న ద్విచక్ర వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు. తిరువళ్లూరు జిల్లా మేసలంబేడు గ్రామానికి చెందిన రామకృష్ణన్ కుమారుడు బాలాజీ (41) వెంగళ్ గ్రామంలోని కెనరా బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి మేసలంబేడు నుంచి వెంగళ్‌కు సైకిల్‌పై డ్యూటీకి వెళ్తుండగా సెంబేడు గ్రామం వద్ద గుర్తు తెలియని ఓ ద్విచక్ర వాహనం అతడిని ఢీకొంది. దీనితో బాలాజీ తలకు గాయమైంది. గమనించిన స్థానికులు 108కి సమాచారం ఇచ్చి, తిరువళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. సమాచారం అందుకున్న వెంగళ్ పోలీసులు అతడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పులి దాడిలో మహిళ మృతి

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో పులి దాడి చేయడంతో ఓ మహిళ మృతిచెందింది. కూడలూరు సమీపం మావనల్లా అటవీ గ్రామానికి చెందిన నాగియమ్మాళ్ (65) ఆదివారం రాత్రి మేకలు, పశువులను తీసుకుని సమీపంలోని అడవికి వెళ్లింది. నాగయమ్మాళ్ నిల్చున్న ప్రాంతానికి కొంత దూరంలో ఉన్న వాగు దగ్గరకు వచ్చిన పులి ఆమెను నోటి కరుచుకుని అడవిలోకి లాక్కెళ్లింది. ఆ సమయంలో కొంద దూరంలో ఉన్న బాలుడు అది చూసి భయంతో గ్రామంలోకి పరుగులు తీసి విషయం చెప్పాడు. గ్రామస్తులు, మసినకుడి అటవీ శాఖ అధికారులు, సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. వారు అక్కడకు చేరుకునే సమయానికి నాగయమ్మాళ్ శరీరాన్ని తింటున్న పులి, గ్రామస్తుల కేకలతో మృతదేహాన్ని విడిచి అడవిలోకి పరుగులు తీసింది. అటవీ శాఖ అధికారులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. తప్పించుకుపోయిన పులి, మళ్లీ దాడిచేసే అవకాశముందని, దానిని బంధించాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సత్వరం బోనులు ఏర్పాటుచేసి పులిని బంధిస్తామని అధికారులు హామి ఇచ్చారు.



మృతురాలు నాగియమ్మాళ్ (ఫైల్‌ఫొటో)

నేరాల నియంత్రణకు టీఎంసీ కౌన్సిలర్ కృషి

● సొంత ఖర్చుతో 50 సీసీ కెమెరాల ఏర్పాటు



స్తంభాలకు బిగించిన సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న పోలీసులు

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనం పట్టణ పంచాయతీలో ఇటీవలి కాలంలో పెరిగిన నేరాలను అదుపు చేయడంలో భాగంగా తమిళ మానిల కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్ అయోద్ది తన సొంత ఖర్చులతో రూ.5లక్షలు వెచ్చించి 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆ ఊరిలోని బస్టాండు, సంత ప్రాంత్రాల్లోనూ ఈ కెమెరాలను బిగించారు. ఈ సీసీ కెమెరాలను మానామదురై డీఎస్పీ పార్తీబన్ ప్రారంభించారు.


● కరూర్ దుర్ఘటన వ్యవహారం....

సీబీఐ విచారణకు టీవీకే నేతల హాజరు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనకు సంబంధించి సీబీఐ విచారణకు టీవీకే నేతలు హాజరయ్యారు. తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ సెప్టెంబరు 27వ తేది కరూర్‌లో నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు ఉత్తర్వులతో సీబీఐ అధికారులు విచారణ తీవ్రతరం చేశారు. ఇప్పటికే పోలీసు అధికారులు సహా వ్యాపారులు, మృతుల కుటుంబాలు, క్షతగాత్రులను విచారించారు. ఈ నేపథ్యంలో, కరూర్ ఘటనకు సంబంధించి టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్.ఆనంద్, నిర్వాహకులు ఆదవ్ అర్జున, నిర్మల్‌కుమార్, కరూర్ జిల్లా కార్యదర్శి మదియళగన్ తదితరులు సోమవారం సీబీఐ విచారణకు హాజరయ్యారు.

చెన్నై మినహా ఇతర నగరాలకు మెట్రోరైలు సర్వీసులు అవసరమా?

● కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం



శివగంగలో మీడియాతో మాట్లాడుతున్న కార్తీ

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై మినహా రాష్ట్రంలోని ఇతర నగరాలకు మెట్రోరైలు అవసరమా? అని రాష్ట్ర ప్రభుత్వం బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, తనకు సంబంధించినంతవరకూ ఇతర నగరాలలో మెట్రోరైలు సర్వీసులు అనవసరమేనని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అన్నారు. శివగంగ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఓ వివాహ వేడుకలకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ బిహార్‌లో నితీష్‌కుమార్ ఎంతకాలం ఆ రాష్ట్రానికి సీఎంగా ఉంటారో చెప్పలేమని, కేంద్రంలోని బీజేపీ చేతుల్లోనే ఆ సీఎం భవిష్యత్ ఆధారపడి ఉందని చెప్పారు. ఇండోర్, ఆగ్రా నగరాల్లోని మెట్రోరైలు సేవలు తీవ్ర నష్టాల్లో కొనసాగుతున్నాయని, అలాంటి పరిస్థితులు తమిళనాట రాకూడదని, కనుకనే తాను చెన్నై మినహా ఇతర నగరాలలో మెట్రోరైలు సర్వీసులు అనవసరమేనని కార్తీ చిదంబరం వివరణ ఇచ్చారు.

5 నెలల వరకు మోదీకి దక్షిణాది వంటకాలే ఇష్టం..

ప్రధాని నరేంద్రమోదీ రాబోవు ఐదు నెలల వరకు కేరళ, తమిళనాడు, అస్సాం, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి వంటకాలే ఆరగించనున్నారని, తమిళ భాష, తమిళ సంస్కృతి గురించి ప్రతి సభలోనూ ఎలుగెత్తి చాటుతారని కార్తీ చిదంబరం యెద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ఆరుమాసాలే ఉండటంతో మోదీ ఐదు నెలల దాకా దక్షిణభారత ప్రజల సంస్కృతిని గుర్తుకు తెచ్చే దుస్తులనే ధరిస్తారని, తమిళనాడుకు వస్తే ధోవతి, అంగవస్త్రం ధరించి తమిళులపై ప్రేమాభిమానాలను చాటుకుంటారని ఛలోక్తి విసిరారు.

కూలీలపై దాడి...

నలుగురు యువకుల అరెస్ట్

తిరుత్తణి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూలీలపై దాడికి పాల్పడిన కేసులో పోలీసులు నలుగురు యువకులు అరెస్ట్ చేశారు. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని మేళపూడి గ్రామంలోని రమణి అమ్మాళ్‌కు చెదిన చెరకు తోటలో ఆంధ్రప్రదేశ్ విశాఖకు చెందిన లవరాజు, అర్జున్ అనే ఇద్దరు కూలీలు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం రాత్రి బైక్‌పై వచ్చిన నలుగురు యువకులు మద్యం మత్తులో లవరాజు, అర్జున్‌లపై దాడికి పాల్పడ్డారు. అసభ్యకరమైన పదజాలంతో దుర్భాషలాడుతూ కర్రలతో చితకబాదారు. దీంతో వారు భయంతో కేకలు వేయగా, స్థానికులు రావడంతో అక్కడి నుండి పరారైయ్యారు. దీనిపై అందిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిద్దరిని ఆస్పత్రికి తరలించిన అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం ఉదయం నిందితులను అరెస్టు చేశారు. విచారణలో వారు అదేప్రాంతానికి చెందిన ఢిల్లీరాజ్, కవిరాజ్, బెంగళూరుకు చెందిన సుజిత్‌కుమార్, దయాళన్‌లుగా పోలీసులు గుర్తించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



కార్తీక రాణి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీపీ సత్రం క్వార్టర్స్‌లో ఉంటున్న మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడింది. అన్నానగర్ ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న కార్తీక రాణి (30) టీపీ సత్రంలోని పోలీసు క్వార్టర్స్‌లో తన ఇద్దరు పిల్లలతో నివసిస్తోంది. సోమవారం ఉదయం ఎంతకూ బయటకు రాకపోవడంతో అనుమానించిన చుట్టుపక్కలవారు, అక్కడకు వెళ్లి చూడగా, ఇంటి తలుపులకు లోపల గడియపెట్టి ఉంది. దీంతో వారు కిటికీలో నుంచి చూడగా కార్తీక రాణి ఉరేసుకుని కనిపించింది. సమాచారం అందుకున్న టీపీ సత్రం పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మనస్పర్థల కారణంగా భర్తను వదిలి ఏడాదిగా పిల్లలతో ఉంటున్న కార్తీక రాణి, మానసికఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

భార్యను హత్యచేసిన భర్త అరెస్ట్

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా పడప్పై సమీపంలోని ఆదనాంజేరి గ్రామంలో భార్య శీలాన్ని శంకించి దారుణంగా హతమార్చిన భర్తను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదనాంజేరి గ్రామానికి చెందిన గంగాధరన్ (36), నందిని (38)లకు 12యేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. గంగాధరన్ లోడు వాహనం డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో భార్య నందినికి మరో వ్యక్తితో వివాహేతర సంబంధాలున్నాయని శంకించిన గంగాధరన్ ఆమెతో తరచూ గొడవ పడుతుండేవాడని తెలిసింది. ఈ నేపథ్యంలో, ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో గంగాధరన్ కత్తితో నందినిపై దాడి చేయడంతో ఆమె మృతిచెందింది. సమాచారం తెలిసి ఘటనా స్థలానికి చేరిన పోలీసులు నందిని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గంగాధరన్‌ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు



ఆస్పత్రిలో కోలుకున్న గ్రామస్తులు

తిరుత్తణి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో గత సోమవారం కలుషిత నీరు తాగిన కారణంగా 40 మందికి పైగా అస్వస్థతకు గురికావడంతో వారిని గ్రామస్తులు తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వారం రోజుల పాటు వారికి చికిత్సలు అందించగా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇద్దరు వ్యక్తులు సహా 40 మంది కోలుకున్నట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం వారందరిని వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా చికిత్స అందించిన వైద్యులు ధనుంజయన్, కార్తిక్, కుమరగురు సహా వైద్య సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక నుండైనా నీటి సరఫరా పట్ల నిర్లక్ష్యం వహించొద్దని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

15న అర్హులకు కలైంజర్ సాధికారిక నగదు

● డిప్యూటీ సీఎం ఉదయనిధి

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గృహిణులకు ప్రతి నెలా రూ.1000 చెల్లించే కలైంజర్ సాధికారిక నగదు పంపిణీ పథకం కింద డిసెంబర్ 15న అర్హులైన గృహిణులకు నగదు పంపిణీ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రకటించారు. తిరువేర్కాడులో సోమవారం ఉదయం నిరుపేదలకు సహాయాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో 20లక్షల మందికి ఇళ్ల పట్టాలను అందించామని, తొలివిడతలో నగదు పథకం ద్వారా లబ్ధిపొందని గృహిణులకు కొన్ని నిబంధనలను ప్రభుత్వం సడలించిందని, ఆ ప్రకారం అర్హులైన గృహిణులందరికి డిసెంబర్ 15న ఈ పథకాన్ని అమలు చేస్తామని ఆయన తెలిపారు.

ధాన్యంలో తేమ శాతం పెంపుదలకు కేంద్రం నిరాకరణ

● డీఎంకే కూటమి నేతల ధర్నా

అడయార్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ధాన్య సేకరణ ప్రక్రియలో భాగంగా ధాన్యంలోని తేమ శాతాన్ని పెంచి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని కేంద్రం తిరస్కరించింది. దీనికి నిరసనగా డీఎంకే కూటమి పార్టీల నేతలు సోమవారం తిరువారూరు జిల్లాలో భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వర్షాలకు కోతకు వచ్చిన పంట తడిసిపోయింది. ఈ కారణంగా ధాన్యంలో తేమ శాతాన్ని 17 నుంచి 22 శాతానికి పెంచాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయగా, దాన్ని తిరస్కరించినట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ తాజాగా వెల్లడించారు. దీంతో డీఎంకే కూటమి నేతలు కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ ప్రభుత్వ రైతు సంక్షేమానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు.

మనసెలా వచ్చిందో....!

● కాలువలో పసికందు మృతదేహం



వేలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జన్మించి కొన్ని గంటలే అయిన పసికందు మృతదేహం కాలువలో లభ్యమవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పెండెలెంట్ ప్రభుత్వాసుపత్రి సమీపంలోని కాలువలో పసికందు మృతదేహాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వేలూరు రెవెన్యూ అధికారి వడివేలు, వేలూరు దక్షిణం సీఐ కాండీపన్ తదితరులు ఆ ప్రాంతానికి చేరుకుని, మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. పసికందు ఇదే ఆసుపత్రిలో ఆదివారం రాత్రి జన్మించిందని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, పసికందు కాలువలో పడవేసిన వ్యవహారంపై విచారణ చేపట్టారు.

డీఎండీకే ఉండే కూటమిదే విజయం: ప్రేమలత

ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో డీఎండీకే ఉండే కూటమినే ప్రజలు గెలిపిస్తారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రేమలత చేపట్టిన 'ఉల్లంతేడి-ఇళ్లంనాడి' ప్రచార పర్యటనలో భాగంగా ఆదివారం మదురై జిల్లా తిరుప్పరంకుండ్రంలో నిర్వహించిన సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మీనాక్షి అమ్మవారు కొలువైన మదురై క్షేత్రం డీఎండీకేకు కలిసొచ్చిందని, కెప్టెన్ విజయకాంత్ కూడా ఇక్కడి నుండే పార్టీని ప్రారంభించారని తెలిపారు. కార్యకర్తలు ఎదురుచూస్తున్న విధంగా కూటమి ఏర్పాటవుతుందని, డీఎండీకే ఉన్న కూటమినే ప్రజలు గెలిపిస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ తరపున 60వేల బూత్ కమిటీలు ఉన్నాయని, ఈ కమిటీలు ఇప్పటినుండే సైనికుల్లాగా ఎన్నికల పనుల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు.

వివాహమై 18 రోజులు...!

● తనకు ఇష్టం లేని పెళ్లంటూ భర్తకు మెసేజ్

పెరంబూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భర్తకు వాట్సాప్ ఆడియో పంపి అదృశ్యమైన యువతి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కన్నియాకుమారి జిల్లా వెల్లియూర్ నజరేత్ ప్రాంతానికి చెందిన యువతి చెన్నైలోని ఓ ఐటీ సంస్థలో పనిచేస్తోంది. ఆమెకు సెంపోన్‌విళై ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో ఈ నెల 3వ తేది వివాహమైంది. ఈ క్రమంలో, గత శుక్రవారం భర్త ఉద్యోగానికి వెళ్లిన సమయంలో, సదరు యువతి 7 సవర్ల మంగళసూత్రాన్ని పక్కన పెట్టింది. 'తనకు ఇష్టం లేకుండా వివాహం చేశారని, మీతో సంతోషంగా జీవించలేనంటూ' వాట్సాప్‌లో భర్తకు ఆడియో పోస్ట్ చేసింది. భర్త ఫిర్యాదుతో పోలీసులు అదృశ్యమైన యువతి కోసం గాలిస్తున్నారు.

14 మంది జాలర్లకు రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం జాలర్లకు శ్రీలంక న్యాయస్థానండిసెంబరు 8వ తేది వరకు రిమాండ్ పొడిగించింది. నాగపట్టణానికి చెందిన జాలర్లు ఈ నెల 9వ తేది చేపల వేటకు వెళ్లారు. కచ్చాదీవి సమీపంలో చేపలు పడుతున్న జాలర్లను శ్రీలంక నావికాదళం చుట్టుముట్టింది. సరిహద్దులు దాటి చేపలుపడుతున్నారంటూ 14 మంది జాలర్లను శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేసింది. వారిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించింది. జాలర్లకు విధించిన రిమాండ్ గడువు మంగళవారంతో ముగియగా, వారిని కోర్టులో హాజరుపరిచిన నేపథ్యంలో, డిసెంబరు 8వ తేది వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. కాగా, శ్రీలంక జైళ్లలో ఉన్న రాష్ట్ర జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని రాష్ట్ర జాలర్ల సంఘాల సమాఖ్య విజ్ఞప్తి చేసింది.

నగదు చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

తిరుత్తణి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు నుండి నగదు డ్రా చేసి వెళ్తున్న ఓ మహిళ వద్ద చోరీ చేసిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని కేకేనగర్ ప్రాంతానికి చెందిన మోనిషా అనే మహిళ సోమవారం ఉదయం చిత్తూరు రోడ్డులోని కెనరా బ్యాంకు నుంచి డ్రా చేసిన రూ.95వేలు తీసుకుని సమీపంలోని కూరగాయల మార్కెట్‌కు వెళ్లగా, గమనించిన కొందరు వ్యక్తులు ఆమెను బైక్‌పై వెంబడించి నగదు ఉన్న బ్యాగును దొంగిలించేందుకు యత్నించారు. దీంతో ఆమె పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు నిందితుల్లో ఒకరిని పట్టుకోగా, మిగిలిన వారు పరారయ్యారు. ఆ వ్యక్తిని స్థానికులు చెట్టుకు కట్టేసి చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించి దీనిపై కేసు నమోదు చేసి దోపిడీదారుల నడిపి ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని పరారైన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఆటో డ్రైవర్లకు తలా రూ.15 వేలివ్వాలి



ఆటో డ్రైవర్ల సంతకాలు సేకరిస్తున్న నేతలు

వేలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు అందించాలని హిందూ మున్నని కోట అధ్యక్షుడు మహేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో లక్ష మంది ఆటో డ్రైవర్ల సంతకాలు సేకరించి ప్రభుత్వానికి పంపించనున్నారు. సంతకాల సేకరణ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో హిందూ ఆటో కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మనోహరన్ సహా సభ్యులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

240 మంది ఎస్ఐలకు పదోన్నతి

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పనిచేస్తున్న 240 మంది ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీసు స్టేషన్లు, ప్రత్యేక విభాగాల్లో పనిచేస్తున్న 240 మంది ఎస్ఐలు పదోన్నతులకు పదోన్నతులకు అర్హులుగా జాబితా సిద్ధం చేశారు. ఈ జాబితా పరిశీలించిన రాష్ట్ర ఇన్‌ఛార్జి డీజీపీ, 240 మంది ఎస్ఐలకు ఇన్స్‌పెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ జాబితాలో, గ్రేటర్ చెన్నై పోలీసు శాఖలో పనిచేస్తున్న 39 మంది ఎస్ఐలు సీఐలుగా పదోన్నతి కల్పించారు.



'టెక్సాస్ టైగర్' ఫస్ట్‌లుక్

'టెక్సాస్ టైగర్'గా హృదు హరూన్

'ఫ్యామిలీ పడం' అనే చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు సెల్వకుమార్ తిరుమారన్ మరో చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఈ మూవీకి 'టెక్సాస్ టైగర్' అనే టైటిల్ ఖరారు చేయగా, హీరోగా హృదు హరూన్ నటిస్తున్నారు. యూకే స్క్వాడ్ పతాకంపై సుజిత్, బాలాజీ కుమార్, భారతీ కుమార్, సెల్వ కుమార్ తిరుమారన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరోయిన్‌గా సంయుక్తా విశ్వనాథన్. ఇతర పాత్రల్లో రోహిణి, వాఫా ఖతీజా, పీటర్ కె.పార్తిబన్ కుమార్, అంటోనీ దాసన్ తదితరులు నటించారు. పూర్తి వినోద, మ్యూజికల్ ఎంటర్‌టైనర్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం చెన్నై, పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకోనుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు.

చిత్రజ్యోతి

దివ్యభారతికి మద్దతుగా సినీ కార్మిక సంఘం

తనను కించపరిచే విధంగా తెలుగు సినీ దర్శకుడు చేసిన వ్యాఖ్యలపై కోలీవుడ్ యంగ్ హీరోయిన్ దివ్యభారతి ధైర్యంగా తన వ్యతిరేకత తెలిపారు. దీనిపై అఖిల భారత చలనచిత్ర కార్మికుల సంఘం సంపూర్ణ మద్దతు తెలిపింది. 'సినిమాల్లో పనిచేసే ఏ స్త్రీ కూడా ఇలాంటి సంఘటనలు సహించదు. కానీ దురదృష్టవశాత్తు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. తనకు జరిగిన అవమానాన్ని ధైర్యంగా నిలదీసిన దివ్యభారతిని సినీ కార్మికుల సంఘం అభినందిస్తోంది. అలాగే, చిత్రపరిశ్రమలో బాధిత మహిళలు ఇచ్చే ఫిర్యాదులపై విచారణ జరిపేందుకు, వారి సమస్యలు పరిష్కరించేందుకు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అలాగే, దివ్యభారతి వ్యవహారంలో జాతీయ మహిళా కమిషన్ కూడా జోక్యం చేసుకోవాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు.



పొంగల్ పోటీలో రెండు చిత్రాలేనా?



'జన నాయగన్'లో విజయ్

వచ్చే యేడాది పొంగల్‌కు కేవలం ఇద్దరు పెద్ద హీరోల చిత్రాలు మాత్రమే విడుదలకానున్నాయి. వాటిలో ఒకటి హీరో విజయ్ నటించిన 'జన నాయగన్', రెండోది శివకార్తికేయన్ నటించిన 'పరాశక్తి' ఉన్నాయి. ఈ రెండు కూడా భారీ బడ్జెట్ చిత్రాలు. దీంతో అధిక థియేటర్లలో రిలీజ్‌కానున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తమ సినిమాలను విడుదల చేస్తే థియేటర్లు లభించవనే ధర్మ సంకటంలో పలువురు దర్శక నిర్మాతలున్నారు. నిజానికి హీరో సూర్య నటిస్తున్న 'కరుప్పు' చిత్రం పొంగల్ రేస్‌లో ఉండగా, చివరి నిమిషంలో ఈ చిత్రం విడుదల వాయిదా వేశారు. మరోవైపు, 'జన నాయగన్' మూవీ తమిళనాడు ఏరియా హక్కులు రూ.105 కోట్లకు అమ్ముడుపోయాయి. అలాగే, 'పరాశక్తి' కూడా ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా రికార్డు స్థాయిలో జరిగినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. మొత్తంమీద ఈ యేడాది కోలీవుడ్‌లో పొంగల్ సందడి కేవలం రెండు చిత్రాలతో సరిపెట్టుకోనుంది.



'పరాశక్తి'లో శివకార్తికేయన్, శ్రీలీల

దివాళా తీసినట్టుగా ప్రకటిస్తారా?

విశాల్‌ను ప్రశ్నించిన హైకోర్టు

రూ.10 కోట్లు డిపాజిట్ చేయాలని ఆదేశం



దివాళా తీసినట్టుగా ప్రకటించేందుకు సిద్ధమా? అని నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్‌ను మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. తీసుకున్న రుణం తిరిగి చెల్లించడంలో కోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలను పాటించకపోవడంతో ఒకింత అసహనం వ్యక్తం చేసింది. ప్రముఖ సినీ ఫైనాన్షియర్, నిర్మాత అన్బుచెళియన్ దగ్గర ఒక సినిమా ప్రాజెక్టు నిమిత్తం హీరో విశాల్ గతంలో రూ.21 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ తర్వాత వారి మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఈ రుణాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ చెల్లించేందుకు సమ్మతించింది. అయితే, విశాల్ నటించే చిత్రాల పంపిణీ హక్కులన్నీ తమకే ఇవ్వాలని లైకా షరతు విధించింది. కానీ, విశాల్ తాను నటించిన సినిమా రైట్స్‌ను లైకాకు ఇవ్వకపోగా రుణాన్ని కూడా చెల్లించలేదు. దీంతో లైకా సంస్థ కోర్టును ఆశ్రయించగా, రూ.21 కోట్ల రుణానికి 30 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఇటీవల మద్రాస్ హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశించింది. ఈ తీర్పుపై విశాల్ అప్పీల్ చేయగా, దీనిపై సోమవారం విచారణ జరిగింది. అపుడు విశాల్ తరపున హాజరైన న్యాయవాదులు తమ క్లైయింట్ ధనవంతుడు కాదని కోర్టుకు తెలిపారు. అలా అయితే, మీరు దివాళా తీసినట్టుగా ప్రకటించేందుకు సిద్ధమా? అని ద్విసభ్య ధర్మాసనం ప్రశ్నిస్తూ, గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై తాత్కాలిక స్టే విధించింది. అలాగే, విశాల్ రూ.10 కోట్లు డిపాజిట్ చేయాలని ఆదేశించింది.



బస్టాండు ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి



రూ. 11.81 కోట్లతో అంబత్తూరు బస్టాండ్ పునర్నిర్మాణం

● ప్రారంభించిన డిప్యూటీ సీఎం ఉదయనిధి

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ) ఆధ్వర్యంలో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద రూ.11.81 కోట్లతో పునర్నించిన అంబత్తూరు పారిశ్రామికవాడ బస్టాండును సోమవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారు. రూ.30 కోట్లతో కొనుగోలు చేసిన 51 బస్సులను కూడా ప్రారంభించారు. ఈ బస్టాండును మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి 1967లో ప్రారంభించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ బస్టాండును పునర్నిర్మాణ పనులకు గత యేడాది మార్చి 14న శంకుస్థాపన చేశారు. సెమారు 1.63 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ బస్టాండును రెండస్తుల్లో నిర్మించారు. వాణిజ్య సముదాయులు, కార్యాలయం, సీనియర్ సిటిజెన్లకు వెయిటింగ్ రూమ్, శిశువులకు పాలిచ్చే గది, టికెట్ కౌంటర్ల గది, రెస్టారెంట్లు, డ్రైవర్లు, కండెక్టర్లు విశ్రాంతి తీసుకునే గదులు, లిఫ్ట్ సదుపాయం, ఏటీఎం సదుపాయాలున్నాయి. ఈ బస్టాండు నుండి నగరంలోని పలు ప్రాంతాలకు 139 బస్ సర్వీసులు నడుపుతున్నారు. ఈ కార్యక్రమంలో సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్.ప్రియ, ఎమ్మెల్యేలు తాయగం కవి, వెట్రి అళగన్, జోసెఫ్ సాముయేల్, గృహవసతి నగరశివారు ప్రాంతాల అభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉష తదితరులు పాల్గొన్నారు.

తాను చదివిన పాఠశాలకు సాయం



తరగతి గది ప్రారంభిస్తున్న నిహర్ షాజీ

● ఇస్రో సైంటిస్ట్ నిహర్ షాజీ రూ.8లక్షల విరాళం

అడయార్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాను చదువుకున్న పాఠశాలకు ఇస్రోలో పనిచేసే మహిళా శాస్త్రవేత్త నిహర్ షాజి రూ.8 లక్షలు విరాళంగా ఇచ్చారు. 2023లో ఇస్రో 'ఆదిత్య ఎల్-1' పేరుతో ఉపగ్రహాన్ని ప్రయోగించింది. ఈ ప్రాజెక్టు డైరెక్టరుగా రాష్ట్రానికి చెందిన మహిళా శాస్త్రవేత్త నిహర్ షాజి వ్యవహరించారు. ఆమె స్వస్థలం తెన్‌కాశి జిల్లా సెంగోట్టై. ఆ ప్రాంతంలోని ఎస్ఆర్ఎం ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆమె చదువుకున్నారు. ఆ పాఠశాలలో కొత్త తరగతి గది నిర్మించేందుకు రూ.8లక్షలను విరాళంగా అందజేశారు. ఆ నగదుతోపాటు తమిళనాడు ప్రభుత్వం మరో 24 లక్షలు సమకూర్చి తరగతి గది నిర్మించింది. ఆ తరగతి గదిని ఆదివారం ఆమె ప్రారంభించారు.

జూన్ నుంచి కోయంబేడు-నందబాక్కం

మెట్రో సేవలు



ఎరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం-షోలింగనల్లూర్ మార్గంలో, కోయంబేడు మార్కెట్ నుంచి విరుగంబాక్కం మధ్య మెట్రో రైలుమార్గం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నగరంలో మెట్రో రెండో ప్రాజెక్ట్‌లో మూడు మార్గాల్లో, 119 కి.మీ మేర మెట్రో రైలు మార్గం పనులు జరుగుతున్నాయి. అందులో, 47 కి.మీ కలిగిన మాధవరం-షోలింగనల్లూర్ మార్గంలో 46 రైల్వే స్టేషన్లు ఏర్పాటవుతున్నాయి. ఈ మార్గంలో అధిక భాగం ఎత్తైన స్తంభాలు (ఎలివేటెడ్)పై ఏర్పాటవుతుండడంతో పనుల్లో ఎలాంటి అవాంతరం లేకుండా సాగుతున్నాయి. మాధవరం, రెట్టేరి, కొళత్తూర్, అన్నా నగర్ తదితర ప్రాంతాల్లో స్తంభాల నిర్మాణాలు పూర్తయి, రైలు పట్టాలు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా కోయంబేడు మార్కెట్-విరుగంబాక్కం మధ్య ఇప్పటికే ఏర్పాటుచేసిన వందకు పైగా స్తంభాలపై మెట్రోరైలు ఫ్లై ఓవర్ అనుసంధానం పనులు చేపట్టారు. ఈ విషయమై చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారులు మాట్లాడుతూ... మాధవరం-షోలింగనల్లూర్ మార్గంలో అధిక శాతం స్తంభాలపై రైలు మార్గం ఏర్పాటవుతుండడంతో పనులు వేగవంతగా సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం కోయంబేడు-నందంబాక్కం ట్రేడ్ సెంటర్ మధ్య మెట్రో పనులు 60 శాతం పూర్తయ్యాయని తెలిపారు. విరుగంబాక్కం నుంచి నందంబాక్కం వరకు స్తంభాల పనులు పూర్తికావడంతో, రైలు పట్టాలు, సిగ్నల్స్ అమర్చే పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే, కోయంబేడు నుంచి విరుగంబాక్కం మధ్య స్తంభాల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ పనులు ముగించి కోయంబేడు నుంచి నందంబాక్కం మధ్య 2026 జూన్ నుంచి మెట్రో రైళ్లు నడపాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

రాధాత్రి నేత్రాలయకు జాతీయ పురస్కారం

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని రాధాత్రి నేత్రాలయకు జాతీయ పురస్కారం లభించింది. గురుప్రియ విజన్ రీసెర్చి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈ ఆసుపత్రి టెలియోపాథమాలజీ ప్రాజెక్ట్ చేపట్టింది. ఆ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు రెటినోపతి ఆఫ్ ప్రి మెచ్యూరిటీ (ఆర్ఓపీ) సమస్యతో కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉన్న పిల్లలను గుర్తించి, వారికి ఉచితంగా చికిత్స అందిస్తోంది. ఆ ప్రకారం, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన గ్రామాలకు చెందిన 1.50 లక్షల మంది పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి, 5 వేల మంది పిల్లలు ఆర్వోపీ సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారిని ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందించారు. రాధాత్రి నేత్రాలయం చేస్తున్న సామాజిక సేవలకు ప్రతిష్ఠాత్మకమైన 'హెచ్‌సీఎల్ టెక్ గ్రాండ్' పురస్కారం అందజేసింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాధాత్రి నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ కృష్ణ నిర్వాహకుల నుంచి పురస్కారం అందుకున్నారు.



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ ప్రవీణ కృష్ణ



చెన్నై రాజ్‌భవన్‌లో కేంద్ర హోం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'మై భారత్' పేరుతో నిర్వహించిన 17వ గిరిజన యువజనుల మార్పిడి కార్యక్రమం ప్రారంభోత్సవంలో గిరిజన వేషధారణలో ఉన్న బాలికలతో నృత్యం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి



టవర్ క్లాక్ పనులు జరుగుతున్న దృశ్యం

పార్క్ రైల్వేస్టేషన్ వద్ద 'టవర్ క్లాక్'

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్క్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రయాణికులను ఆకర్షించేలా టవర్ క్లాక్ నిర్మాణపనులు జరుగుతున్నాయి. భారత రైల్వే 'అమృత్ భారత్' పథకంలో, రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, అభివృద్ధి పనులు చేపడుతోంది. అందులో భాగంగా, సెంట్రల్ పార్క్ రైల్వేస్టేషన్‌ను రూ.10.68 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. ప్లాట్‌ఫారాలపై ఆధునిక పైకప్పు, సీటింగ్, సమాచార బోర్డులు, లౌడ్ స్పీకర్లు, సీసీ కెమెరాలు తదితరాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ క్రమంలో, స్టేషన్ ప్రవేశ మార్గంలో ప్రయాణికులను ఆకర్షించేలా 30 అడుగుల ఎత్తున టవర్ క్లాక్ ఏర్పాటుపనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనులు ముగించి వచ్చే నెల చివరి నాటికి టవర్ క్లాక్ ప్రారంభించాలని నిర్ణయించినట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు.



సెలూన్ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

అడయార్‌లో 'పేజ్3' సెలూన్

అడయార్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్‌లోని కస్తూర్బా నగర్ కామరాజ్ అవెన్యూలో దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన 'పేజ్3' సెలూన్ ఏర్పాటైంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు రేష్మా పసుపులేటి, పార్వతి నాయర్, కేపీవై బాలా, షైనా నందిని, సీకే కుమార్‌వేల్, వీణా కుమారవేల్, సి.శివశంకరన్ తదితరులు దీనిని ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సెలూన్ ప్రారంభోత్సవం సందర్భంగా వివిధ రాయితీలు కలిగిన 'ఫుల్‌హౌస్', స్ట్రెయిట్ ఫ్లష్ బెనిఫిట్ కార్డులను విడుదల చేశారు.

సిక్కు మత గురువు తేగ్ బహదూర్

బలిదాన వార్షికోత్సవాలు

● సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆనందపూర్ సాహెబ్‌లో నిర్వహించిన తొమ్మిదవ సిక్కు మత గురువు గురు తేగ్‌హ బహదూర్ బలిదానం 350వ వార్షిక ఉత్సవాలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని అక్టోబర్ 17న పంజాబ్ మంత్రులు హర్భజన్‌సింగ్, బీరేంద్రకుమార్ ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి ఆహ్వానించారు. ఆదివారం జరిగిన ఈ ఉత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్, ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి పాల్గొన్నారు. ఆ సందర్భంగా వారిద్దరూ పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్‌ను కలిసి సీఎం స్టాలిన్ శుభాకాంక్షల సందేశాన్ని అందజేశారు. ఈ ఉత్సవాలకు తనను ఆహ్వానించిన పంజాబ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాని, అనివార్య కారణాల వల్ల తాను రాలేకపోయినా, తన తరఫున మంత్రి పళనివేల్ త్యాగరాజన్, ఎంపీ కళానిధి వీరాసామిని పంపానని ఆ లేఖలో సీఎం పేర్కొన్నారు.



పంజాబ్ సీఎం భగవంత్‌మాన్‌కు సీఎం స్టాలిన్ లేఖ అందజేస్తున్న మంత్రి పళనివేల్ త్యాగరాజన్, ఎంపీ కళానిధి వీరాసామి

నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్

సభ్యుడిగా శ్రీహర్ వైద్యుడు



డాక్టర్ మురుగేశన్

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' (శ్రీహర్)లోని ఫార్మసీ ఫ్యాకల్టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మురుగేశన్ ఆరుముగం 'నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్' సభ్యుడిగా ఎన్నికయ్యారు. డాక్టర్ మురుగేశన్ పరిశోధన ఔషధాల ఆవిష్కరణ మైగ్రేన్ పాథోఫిజియాలజీపై దృష్టి పెడుతోంది. మైగ్రేన్ ఆటో ఇమ్యూన్ ప్రాతిపదికను కలిగి వుంటుందని ప్రతిపాదించిన మొదటి పరిశోధకుల్లో ఆయన ఒకరు. డాక్టర్ మురుగేశన్ గతంలో యూజీసీ-బీఎస్ఆర్ ఫెలోషిప్, సీఎస్ఐఆర్-పూల్ సైంటిస్ట్ ఫెలోషిప్, రాయల్ సొసైటీ (యూకే) డ్రగ్ డిస్కవరీ అవార్డుతో సహా విద్యాపరమైన ప్రతిభకు గుర్తింపుగా అనేక అవార్డులను అందుకున్నారు.

రాష్ట్రంలో మళ్లీ డీఎంకే పాలన

● సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబి



ఎంఏ బేబి

పెరంబూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకేను మళ్లీ అధికారంలోకి వచ్చేలా చేయడమే తమ లక్ష్యమని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో 108వ నవంబరు విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుప్పూర్ రాయపురం ఆదివారం రాత్రి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఎంఏ బేబి మాట్లాడుతూ... కోవై, మదురైకు రావాల్సిన మెట్రో రైలు ప్రాజెక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం నిరాకరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. బీజేపీ మద్దతివ్వని రాష్ట్రాల పట్ల సవతి తల్లి వైఖరితో వ్యవహరించడంతో పాటు, గవర్నర్ల ద్వారా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో తమిళనాడు పాలన ముఖ్యమైనదిగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఫాసిస్ట్ కూటమికి వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ఉదాహరణగా తమిళనాడులో డీఎంకే కూటమి నిలిచిందన్నారు. రాష్ట్రంలో మళ్లీ డీఎంకే అధికారంలోకి వచ్చేలా చేయడమే తమ లక్ష్యమని అన్నారు. తమిళనాడులోని డీఎంకే కూటమిని మరింత బలోపేతం చేసి, రాబోయే ఎన్నికల్లో మతవాత పార్టీలను ఓడించేలా కూటమి పార్టీలు పనిచేస్తాయన్నారు. అలాగే, కేరళ, ఒడిశా, పుదుచ్చేరి లో కూడా బీజేపీ కూటమిని ఓడించేలా సీపీఎం ప్రచారం చేపడుతుందని బేబి తెలిపారు.

'అరుణ్' నుంచి 'ఐస్‌క్రీం డోనట్'

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐస్‌క్రీం ఉత్పత్తుల్లో పేరుగాంచిన అరుణ్ ఐస్‌క్రీమ్స్ సంస్థ ఐస్‌క్రీం డోనట్‌ను తాజాగా ఆవిష్కరించి మార్కెట్లోకి విడుదల చేసింది. కొత్త ఆవిష్కరణలతో అన్ని వయసుల వారిని ఆకర్షించే క్లాసిక్ ట్రీట్స్, క్రాస్టింగ్ అనుభవాలను తిరిగి ఊహించుకోవడానికి నిబద్ధతతో వున్నట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అరుణ్ ఐస్‌క్రీం డోనట్స్ బెల్జియన్ చాక్లెట్, కుకీ ఎన్‌క్రీమ్ ఫ్లేవర్లలో తయారు చేస్తున్నామని, కేవలం రూ.10కే అందుబాటులో వుంచామని వివరించారు.

ఎగ్మూరు - రామేశ్వరం మధ్య వచ్చే నెల నుంచి వందే భారత్



ప్యారీస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి రామేశ్వరానికి వందేభారత్ రైలు పరుగులు పెట్టనుంది. వచ్చే నెల ఈ రైలు సేలు ప్రారంభమయ్యే అవకాశముందని దక్షిణరైల్వే వర్గాలు తెలిపాయి. దేశంలో వేగవంతమైన లగ్జరీ రవాణా వ్యవస్థను ప్రజలకు అందించాలన్న దృక్పథంతో రైల్వేశాఖ వందే భారత్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 50కి పైగా రైళ్లు పలు రాష్ట్రాలను కలుపుతూ నడుపుతున్నారు. ఇదిలా వుండగా, దక్షిణ రైల్వే పరిధిలో ఇప్పటికే 10కి పైగా వందే భారత్ రైళ్లు నడుతున్నారు. ఈ రైళ్లకు ప్రయాణికుల నుండి మంచి స్పందన లభించింది. ఎగ్మూర్ నుండి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతమైన రామేశ్వరం మధ్య నడపనున్న వందే భారత్ రైలు టైం టేబుల్ విడుదలైంది. అందులోని వివరాల మేరకు ఆ రైలు బుధవారం మినహా మిగతా రోజుల్లో అందుబాటులో ఉంటుంది. ఈ రైలు ఎగ్మూర్ నుంచి తెల్లవారుజామున 5గంటల బయలేదేరి మధ్యాహ్నం 1.15 గంటలకు రామేశ్వరం చేరుకుంటుంది. మరుమార్గంలో రామేశ్వరంలో మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి రాత్రి 10.20 గంటలకు ఎగ్మూర్ చేరుకుంటుంది. ఈ రైలు తాంబరం, విల్లుపురం, తిరుచ్చి, శివగంగ, రామనాథపురం స్టేషన్లలో ఆగుతుంది. ఇదిలా వుండగా, ఏ తేదీ నుండి ఈ రైలు నడుపుతారన్నది వెల్లడించలేదు. అయినప్పటికీ డిసెంబరు మొదటివారంలో ప్రధాని నరేంద్ర మోదీ రామేశ్వరం వందే భారత్ ప్రారంభించే అవకాశం ఉందని దక్షిణ రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

మాల్వాడిగుండం వద్ద బోల్తాపడిన కారు


ప్రమాదానికి గురైన కారు

● ముగ్గురికి స్వల్ప గాయాలు

తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో సోమవారం ఓ కారు బోల్తాపడింది. తమిళనాడుకు చెందిన కుటుంబం దర్శనం పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణం కాగా మాల్వాడి గుండంకు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ముగ్గురు భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి రూ.20 లక్షల వినికిడి యంత్రాలు



టీటీడీకి రూ.20 లక్షల విలువైన 105 వినికిడి యంత్రాలు సోమవారం విరాళంగా అందాయి. తిరుపతికి చెందిన ఎన్ విరాట్ తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు వీటిని అందజేశారు. శ్రవణం ప్రాజెక్ట్‌లో శిక్షణ పూర్తిచేసుకుని బయటకు వెళ్లే పిల్లలకు ఈ వినికిడి యంత్రాలను అందజేస్తారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.61 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,974
తలనీలాలు సమర్పించినవారు: 28,995



మహారథంపై బ్రహ్మాండనాయకి


రథంపై చల్లిని మిరియాలు ఏరుకుంటున్న భక్తులు









ముత్యపు కవచపు అలంకారంలో.. సర్వస్వతంత్ర వీరలక్ష్మిగా పద్మావతి అమ్మవారు మహారథంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం అమ్మవారికి రథోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. రథబలి కైంకర్యం నిర్వహించాక ఉత్సవమూర్తిని వేంచేపుగా రథమండపానికి తీసుకొచ్చారు. ఉదయం 9.15గంటలకు ధనుర్లగ్నంలో ముత్యపుకవచంతో ప్రసన్నమూర్తిగా అమ్మవారు రథంపై కొలువు దీరి భక్తులను కటాక్షించారు. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఆధ్యాత్మిక వాతావరణంలో రథం ముందుకుసాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు రథాన్ని లాగారు. ఇక, రథంపై మిరియాలు, ఉప్పు చల్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రథ మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. - తిరుచానూరు, ఆంధ్రజ్యోతి









పుష్కరిణి వద్ద ఏర్పాట్ల పరిశీలన



తిరుచానూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో మంగళవారం పంచమి తీర్థం జరగనుంది. ఈ నేపథ్యంలో జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బ రాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు సోమవారం అమ్మవారి పుష్కరిణి, ఆలయ మాడవీధులు పరిశీలించారు. చక్ర స్నానం సందర్భంగా ఎస్డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కూడా భద్రతా చర్యల్లో పాల్గొంటాయన్నారు. అంతకు ముందు శిల్పారామంలో బందోబస్తు విధులకు వచ్చిన పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. భక్తులతో మర్యాదగా మెలగాలని, చిన్న సంఘటన జరిగినా ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు ధ్వజావరోహణం, రేపు పుష్పయాగం

తిరుచానూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి బంగారు తిరుచ్చిపై అమ్మవారు తిరువీధుల్లో విహరిస్తారు. అనంతరం పాంచరాత్ర ఆగమశాస్త్రోక్తంగా ధ్వజ స్తంభంపై ఉన్న గజచిత్రపటాన్ని అర్చకులు అవరోహణ చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బుధవారం సాయంత్రం అమ్మవారికి పుష్పయాగం నిర్వహించనున్నారు. భక్తులు టిక్కెట్లు కొని పాల్గొనవచ్చు.

నేడు బంగారు చీరలో అమ్మవారి దర్శనం

పంచమితీర్థం సందర్భంగా అమ్మవారు మంగళవారం బంగారు చీరలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 12 ఏళ్ల కిందట రూ.3 కోట్ల విలువ చేసే ఈ బంగారు పట్టుచీరను గుంటూరుకు చెందిన ఓ దాత సమర్పించారు. అప్పటి నుంచి బంగారు చీరను అమ్మవారికి కడుతున్నారు.

నేడు అమ్మవారికి అయ్యవారి సారె

తిరుమల/తిరుచానూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పంచమితీర్థం సందర్భంగా తిరుమల శ్రీవారి తరపున మంగళవారం అమ్మవారికి సారె పంపనున్నారు. శ్రీవారి ఆలయం నుంచి వేకువజామున పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణాలతో కూడి సారెను ఆలయ నాలుగు మాడవీధుల గుండా ఊరేగిస్తారు. ఈ సారెతో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఏకాంగులు, అర్చకులు, పరిచారకులు కాలిమార్గాన అలిపిరికి చేరుకుంటారు. అక్కడ వారికి అమ్మవారి ప్రతినిధిగా తిరుపతి జేఈవో వీరబ్రహ్మం స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఏనుగు అంబారిపై ఊరేగింపుగా కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండు, లక్ష్మీపురం మీదుగా అమ్మవారి ఆలయానికి.. అక్కడ్నుంచి పంచమితీర్థం మండపానికి తీసుకొస్తారు. సారెలోని పసుపు, చందనం తదితరాలతో ఉత్సవమూర్తి, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

నేడు ఎస్వీయూకు సెలవు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచమి తీర్థం సందర్భంగా ఎస్వీయూకు మంగళవారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

పంచమితీర్థానికి 40బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో మంగళవారం జరిగే పంచమితీర్థానికి హాజరయ్యే భక్తులకోసం 40 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం విశ్వనాథం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి సీబీఎస్‌లో ఈ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. బస్టాండు, లక్ష్మీపురం కూడలి, మామిడికాయల మండీ, జాతీయ రహదారి, ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి తిరుగు ప్రయాణమవుతాయన్నారు నిమిషానికో బస్సు అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలి


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువన్షి, డీఆర్వో నరసింహులు

● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 288 వినతులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 288 వినతులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖవే 196 ఉన్నాయి. ఈ వినతులను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు.

నకిలీ పాసుపుస్తకాలతో భూమి కాజేయాలని చూస్తున్నారు



సర్వే నెంబరు 35/2లోని భూములను మేము కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నాం. పుత్తూరుకు చెందిన ఎంఎస్ కదిరివేలు ఆ భూములకు నకిలీ పాసుపుస్తకాలు సృష్టించి మమ్మల్ని రానివ్వకుండా చేస్తున్నారు. దౌర్జన్యానికి పాల్పడుతున్నాడు. అతడిపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి.

- గోపాలకృష్ణాపురం ఎస్టీకాలనీవాసులు, పుత్తూరు మండలం

మా భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు

తిరుచానూరు గ్రామ పరిధిలోని యోగిమల్లవరం సర్వే నెంబరు 11లో నాకు నాలుగు సెంట్ల స్థలముంది. 2.5 సెంట్లలో ఇల్లు కట్టుకుని, మిగిలిన దాంట్లో ఆవుల కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకున్నా. అందులో 1.50సెంట్లు పక్కనే ఉన్న పొక్కాలమ్మ గుడికి చెందిందని చెప్పి నన్ను ఇబ్బంది పెడుతున్నారు. విచారించి న్యాయం చేయండి.

- నారాయణ, యోగిమల్లవరం, తిరుచానూరు పంచాయతీ

రీ వెరిఫికేషన్‌తో మనోభావాలు దెబ్బతీశారు

గతంలో సదరం సర్టిఫికెట్లలో 70 శాతానికిపైగా వికలత్వం ఇచ్చారు. రీవెరిఫికేషన్ పేరుతో ఇప్పుడు దాన్ని 50 శాతానికి తగ్గించి మా మనోభావాలను దెబ్బతీశారని దివ్యాంగుల సేవా సమితి సభ్యులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మురళి, శోభన్‌బాబు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీ పరిధిలో సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లపై అధికారులు సంతకం పెట్టడం లేదని, మూడు చక్రాల మోటార్ సైకిళ్ల దరఖాస్తుకు గడువు పెంచాలని కోరారు.



జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించండి

పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, విష పురుగులు చొరబడుతున్నాయన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచాలని ఫెడరేషన్ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, జీతాలు పెంచి సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రిటైర్‌మెంట్ వయసు 62కు పెంచాలన్నారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఇళ్ల పట్టాలివ్వండి : తాము రెండేళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలివ్వాలని వెంకటగిరి మండలం పెట్లూరు పంచాయతీ సీతారాం ఏచూరి నగర్ వాసులు కోరారు. సర్వే నెంబరు 12/1లో 2011 నుంచి నివాసముంటున్నా పట్టా ఇవ్వలేదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అది రిజర్వ్ ఫారెస్టుగా ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. అది పశువుల మేత భూమిగా తహసీల్దారు ఎండార్స్‌మెంట్ కాపీని తమకు ఇచ్చారని వివరించారు. అనాధీనంగా మార్చి తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

పెచ్చులూడిన కలెక్టరేట్ మెట్లు



కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుండగా మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో బ్లాక్ బి వద్ద మొదటి అంతస్థుకు వెళ్లేమార్గంలో మెట్లు పెచ్చులూడి పడ్డాయి. దీంతో అధికారులు, అర్జీదారులు ఉలిక్కిపడ్డారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం ప్రమాదం తప్పింది.

వినుత దంపతులే హతమార్చి ఉంటారు!

● రాయుడి సోదరి కీర్తిప్రియ ఆరోపణ



శ్రీకాళహస్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన అన్న రాయుడు అలియాస్ శ్రీనివాసులును శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వినుత వాళ్లే హతమార్చి ఉంటారని కీర్తిప్రియ ఆరోపించారు. దీనిపై సోమవారం ఆమె వీడియో విడుదల చేశారు. 'వినుత వాళ్లే మా అన్న రాయుడిని హత్య చేసి ఉంటారని బలంగా అనుమానిస్తున్నా. ఎమ్మెల్యే సుధీర్‌పై వినుత దంపతుల ఆరోపణలకు ఎలాంటి పొంతన కుదరడం లేదు. ఎమ్మెల్యే పాత్ర నిజమైతే రాయుడిని చంపకుండా సాక్ష్యాలను బహిర్గతం చేసి ఉండొచ్చు. అలా కాకుండా అప్పుడప్పుడు వీడియోలను వదులుతూ ఆరోపణలు చేయడంపై అనుమానం కలుగుతోంది. ఎన్నో లక్షలు ఖర్చు పెట్టి రాయుడి వీడియోలను రికవరీ చేశామని వినుత వర్గం చెప్పుకోవడం ద్వారా.. వాళ్లే చనిపోయిన రాయుడు వీడియోలను సృష్టిస్తున్నారన్న అనుమానం వస్తోంది. ఈ హత్యకేసును లోతుగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలి' అని ఆ వీడియోలో ఆమె కోరారు.

తిరుపతి రైల్వే స్టేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● సీపీఎం మాజీ ఎంపీ మధు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని సీపీఎం మాజీ ఎంపీ మధు డిమాండు చేశారు. తిరుపతిలోని తిరుపతిలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్‌గా ప్రభుత్వం మార్చేస్తోందని ఆరోపించారు. 'పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సరఫరా, పారిశుధ్యం తదితరాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించి ప్రభుత్వం తీవ్ర నష్టం కలిగిస్తోంది. రాష్ట్రంలో రూ6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయక 60 డిగ్రీ కళాశాలలు మూత పడ్డాయి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చేస్తామన్న లోకేశ్ హామీ ఏమైంది? ఆరోగ్యశ్రీ పథకానికి రూ.మూడు వేల కోట్ల బకాయిలతో వైద్యం చేయలేమని ఆస్పత్రి యాజమాన్యాలు ప్రకటించాయి. విశాఖ స్టీల్ పక్కనే మరో ప్రైవేటు స్టీల్ ఫ్యాక్టరీకి అనుమతులివ్వడానికి, ఎంపీలచే గనులు కేటాయించమని సీఎం చంద్రబాబు కేంద్రం చుట్టూ తిరగడం దేనికి సంకేతం?' అంటూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు.


మాట్లాడుతున్న సీపీఎం మాజీ ఎంపీ మధు